
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
మంగళవారం, 23 జూలై 2024





	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	30.5	23.9
భద్రాద్రి	24.0	16.0



నిధుల వరద పారేనా?

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- కేటాయింపులపై ఉమ్మడి జిల్లా ప్రజల ఆశలు
- పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఉప ముఖ్యమంత్రి భట్టి
- 'సీతారామ' ప్రాజెక్టుకు మరో రూ.7800 కోట్లు అవసరం..
- ఖమ్మంలో యూనివర్సిటీ ఏర్పాటుకు అడుగులు పడేనా?
- వైద్య కళాశాలల్లో మౌలిక వసతులకు నిధులు ఇచ్చేనా?
- పెదవాగు ప్రాజెక్టు పునరుద్ధరణపై స్పందించేనా?
- రహదారులు, జూనియర్ కళాశాలలకు నిధులపై ఆశలు
- ఉమ్మడి జిల్లా నుంచి అందరు ఎమ్మెల్యేలు అధికారపక్షమే

ఖమ్మం, జూలై 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వర్షాకాల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభం కాబోతున్నాయి. ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి జిల్లాకు చెందిన మల్లు భట్టి విక్రమార్క సారథ్యంలో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు తాత్కాలిక బడ్జెట్ కేటాయింపులు జరుపుతూ బడ్జెట్ సమావేశాలు నిర్వహించారు. ఈ సారి బడ్జెట్ సమావేశాల్లో శాఖల వారీగా పూర్తిస్థాయి కేటాయింపులు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన పదిమంది శాసనసభ్యుల్లో ఉప ముఖ్యమంత్రిగా మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రిగా ఖమ్మం ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రిగా పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యవహరిస్తున్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు బీఆర్ఎస్ నుంచి గెలిచినా తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేల్లో ఆరుగురు అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కాగా, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీపీఐ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఈయన కూడా కాంగ్రెస్ మద్దతతో గెలిచారు. శాసనసభలో సీపీఐ శాసనసభ పక్షనేతగా ఉన్నారు దీంతో జిల్లా ఎమ్మెల్యేల్లో ప్రతిపక్షం గళం వినిపించే అవకాశం లేకుండా పోయింది.

బడ్జెట్ సమావేశాల్లో కేటాయింపులపైనా, ఆయా నియోజకవర్గ సమస్యలపైనా ఎమ్మెల్యేల స్పందన, ప్రస్తావనను బట్టే నిధుల కేటాయింపు జరిగే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా సీతారామ సాగునీటి ప్రాజెక్టు పూర్తికావాలంటే మరో రూ.7800 కోట్లు అవసరం ఉంది. 10 లక్షల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో సాగుతున్న సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా ఒక పంపుహౌస్‌కు ట్రయల్‌రన్ నిర్వహించారు. మరో రెండు పంపుహౌస్‌లకు ట్రయల్‌రన్ నిర్వహించబోతున్నారు. ఈ ఏడాది ఆగస్టు 15లోగా గోదావరి జలాలు ఏన్కూరు లింకు కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు అందించేందుకు పనులు చురుగ్గా సాగుతున్నాయి. పాలేరు లింక్‌కెనాల్ పూర్తికావాలంటే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరగాల్సిన అవసరం ఉంది.

అలాగే ఖమ్మం కేంద్రంగా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. ప్రస్తుతం పాలేరులో ఉన్న జేఎన్‌టీయూ కళాశాలను యూనివర్సిటీగా అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంది. ఏపీలో కాకినాడ, అనంతపురంలో జేఎన్‌టీయూ క్యాంపస్‌లున్నాయి. తెలంగాణలో హైదరాబాద్‌లో మాత్రమే జేఎన్‌టీయూ ఉంది. మరో జేఎన్‌టీయూ యూనివర్సిటీ క్యాంపస్‌ను మద్దులపల్లిలో ఏర్పాటు చేస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు పొరుగున ఉన్న సూర్యాపేట, మహబూబాబాద్, సరిహద్దు ఉన్న ఏపీ, ఛత్తీస్‌గఢ్ విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయని చెబుతున్నారు. ప్రస్తుతం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు మౌలిక వసతులతో శాశ్వత భవనాలను నిర్మించాలంటే సుమారు రూ.500 కోట్లుఅవసరం. ఇప్పటికే 30ఎకరాల భూమి ప్రభుత్వం కేటాయించింది. మరో 30ఎకరాలు కేటాయించాల్సి ఉంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలో ఈ ఇంజనీరింగ్ కళాశాలకు పూర్తిస్థాయి భవనాలు ప్రారంభించాలంటే ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు అవసరం ఉంది.

అలాగే ఖమ్మం మెడికల్ కాలేజీకి పూర్తిస్థాయి భవనాలకు సుమారు 30ఎకరాల స్థలం రఘునాథపాలెం మండలంలో కేటాయించారు. మెడికల్ కాలేజీ మొదటి దశ పనులకు రూ.100కోట్ల మేర నిధుల అవసరం ఉంది. ఈ కళాశాల పూర్తిస్థాయి భవనాల శంకుస్థాపనకు కసరత్తు నడుస్తున్నది. ప్రస్తుతం పాత కలెక్టరేట్ భవనాల్లో కళాశాల నిర్వహిస్తున్నారు. బడ్జెట్‌లో కొత్త మెడికల్ కళాశాల భవనాలకు నిధుల కేటాయింపు అవసరం ఉంది. కొత్తగూడెం మెడికల్ కళాశాల అదనపు భవనాలకు కూడా నిధులు అవసరం ఉంది.

జిల్లాలో పాలేరు, వైరా, లంకాసాగర్, బేతుపల్లి, కిన్నెరసాని, తాలిపేరు తదితర ప్రాజెక్టుల మరమ్మతులకు, ఆధునీకరణ పనులకు నిధుల కేటాయింపు అవసరం ఉంది. వీటికి నీటిపారుదల శాఖ నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. బడ్జెట్‌లో కేటాయింపులు జరపాల్సి ఉంది. ఆర్‌అండ్‌బీ, పీఆర్ రహదారుల మరమ్మతులకు నిర్మాణానికి కూడా నిధులు డిమాండ్ ఉంది. అలాగే ఇటీవల అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టుకు గండి పడింది. దీనిని పూడ్చాలంటే రూ.20 కోట్లు అవసరం అవుతుంది. ఏపీ తెలంగాణ రాష్ట్రాల సంయుక్తంగా ఈ ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టాలంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయింపు చేయాల్సి ఉంది. భద్రాచలం వద్ద గోదావరి కరకట్ట ఆధునీకరణకు నిధులు కేటాయింపు జరగాల్సిన అవసరం ఉంది. అసెంబ్లీ ఎన్నికల తరుణంలో ఎన్నికల బరిలో ఉన్నప్పుడు గెలిచిన ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల్లో జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పనకు, పెండింగ్ ప్రాజెక్టులకు హామీలు ఇచ్చారు. ఈ హామీలు గట్టెక్కాలంటే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కేటాయింపుల్లో నిధులు పొందేలా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.



ఉగ్ర గోదావరి

భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ

- తుది ప్రమాద హెచ్చరిక దిశగా ప్రవాహ ఉధృతి
- నీట మునిగిన దేవస్థానం కల్యాణకట్ట కింది భాగం
- అర్ధరాత్రికి 50 అడుగులు దాటిన నీటిమట్టం
- 24 గంటల్లో 14 అడుగులు పెరిగిన వరద
- వరదపై సమీక్ష నిర్వహించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

భద్రాచలం, జూలై 22: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. గత నాలుగు రోజులుగా క్రమంగా పెరుగుతూ వచ్చిన ప్రవాహం సోమవారం రెండో ప్రమాద హెచ్చరికను దాటి తుది ప్రమాద హెచ్చరిక దిశగా పెరుగుతోంది. భద్రాచలం వద్ద ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు 45.1అడుగులున్న గోదావరి నీటిమట్టం సోమవారం ఉదయం 6 గంటలకు 46.7అడుగులకు చేరుకుంది. ఈ క్రమంలో పెరుగుతూ మధ్యాహ్నం 2.04కు 48అడుగులకు చేరడంతో భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సోమవారం రాత్రి 12గంటలకు నీటిమట్టం 50.6 అడుగులుగా ఉంది. ఎగువనుంచి భారీగా వరద కొనసాగుతుండడంతో తుది ప్రమాద హెచ్చరిక (53అడుగులు) దాటే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరం ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నది ఒడ్డున్న దేవస్థానానికి సంబంధించిన స్నానఘట్టాల వద్ద ఉన్న కల్యాణ కట్ట కింది భాగం పూర్తిగా మునిగిపోయింది. భక్తుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే తాత్కాలిక గదులు మునిగాయి. గోదావరి వరద ఉధృతి అధికంగా ఉండడంతో కరకట్టపై భక్తుల సందర్శనను నిషేధించినట్లు పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. పోలీసు గస్తీని ఏర్పాటు చేశారు. దుమ్ముగూడెం మండలం తూరుబాక వద్ద రహదారి వరద నీరు చేరింది. వరద మరింతగా పెరిగితే రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది.

గోదావరి వరదలపై మంత్రి పొంగులేటి సమీక్ష

భద్రాచలం వద్ద గోదావరి వరద తుది ప్రమాద హెచ్చరికకు చేరువవుతున్న నేపథ్యంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం భద్రాచలం గోదావరి కరకట్టపై నుంచి వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి గతంలో తలెత్తిన లోపాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై మంత్రి దిశ నిర్దేశం చేశారు.

ఏజెన్సీ వాసుల్లో ఆందోళన

గోదావరి నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరికస్థాయిని దాటి భద్రాచలం వద్ద ప్రవహిస్తుండటంతో ఏజెన్సీవాసుల్లో ఆందోళన నెలకొంది. గత 24 గంటల్లో భద్రాచలం వద్ద 14 అడుగుల నీటిమట్టం పెరగడం జరిగింది. 12లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు భద్రాచలం నుంచి దిగువకు ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం రాబోయే 24 గంటల్లో మరింతగా పెరిగే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో వరద ప్రభావిత ముంపు గ్రామాలుగా ముందస్తుగా గుర్తించిన 111గ్రామాల వారిని అధికార యంత్రాంగం ఇప్పటికే అప్రమత్తం చేసింది. ఏ క్షణాన గోదావరి తుది ప్రమాద హెచ్చరిక 53 అడుగులు దాటి ప్రవహించినా దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని పలు గ్రామాల్లో వరద నీరు ప్రవేశించే ప్రమాదం పొంచి ఉండటతో అందుకు అనుగుణంగా స్థానిక అధికారులను ఇప్పటికే సిద్ధం చేసినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో భద్రాచలంలో గోదావరి ఒడ్డున పెద్దలకు పిండప్రదానాలు చేసేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు కరకట్టపైకి జనాన్ని అనుమతించకపోవడంతో కరకట్ట బయటి భాగంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనంతరం గజ ఈతగాళ్ల సహకారంతో పిండాలను కల్యాణ కట్ట కింది భాగంలో కలిపేలా చర్యలు చేపట్టారు.

భద్రాద్రి జిల్లాలో పలుచోట్ల వర్షం

సింగరేణి ఓసీల్లో 1.60 లక్షల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

కొత్తగూడెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సోమవారం పలు మండలాల్లో వర్షం కురిసింది. జిల్లాలో సగటు వర్షపాతం 4 సెంటీమీటర్లుగా నమోదైంది. అత్యధికంగా పినపాక, దుమ్ముగూడెంలో 9.2 సెంటీమీటర్ల వర్షం కురిసింది. గత ఐదు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో పలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు వరద కొనసాగుతుండగా 3 గేట్లు ఎత్తి 16 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి రెండో ప్రమాద హెచ్చరికను దాటింది. ప్రస్తుతం 50.6 అడుగుల వద్ద ప్రవాహం కొనసాగుతోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కలెక్టర్, ఎస్పీలు సూచించారు. తాలిపేరు ప్రాజెక్టు 25 గేట్లు ఎత్తి 60వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. జిల్లాలోని సింగభూపాలెం, తుమ్మల చెరువులు అలుగులు పారుతున్నాయి. భారీ వర్షాలతో జిల్లాలోని సింగరేణి ఓసీల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. కొత్తగూడెం ఏరియా, ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లో సుమారు 1.60 లక్ష టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. వర్షపు నీటిని పైపులైన్ల ద్వారా బయటకు తోడేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో సోమవారం ఎక్కడా వర్షం కురవలేదు.



నిధుల కొరత లేదు..

- వరద బాధితులకు సేవలందించండి
- తేడా వస్తే బాధ్యులపై సస్పెన్షన్ వేటు
- గోదావరి వరద సమీక్షలో మంత్రి పొంగులేటి

6

'పెదవాగు' బాధితులకు
అండగా ఉంటాం

- రహదారులు, విద్యుత్ పునరుద్ధరణకు రూ.8.50కోట్లు
- ఇసుక మేటల తొలగింపునకు ఎకరానికి రూ.10వేలు
- నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు, ఉచితంగా విత్తనాలు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన



పెదవాగు ప్రాజెక్టు వద్ద మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే జారే, కలెక్టర్, ఎస్పీ

అశ్వారావుపేట/అశ్వారావుపేటరూరల్, జూలై 22: పెదవాగు ప్రాజెక్టు వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసెడ్డి హామీ ఇచ్చారు. మండలంలో ఇటీవల భారీ వరదలతో తెగిపోయిన పెదవాగు ప్రాజెక్టును, వరదకు దెబ్బతిన్న గ్రామాలు, పొలాలను మంత్రి పొంగులేటి సోమవారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్, ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రాజెక్టుకు గండి పడడానికి కారణాలను తెలుసుకున్న మంత్రి తక్షణ మరమ్మతుల కోసం అంచనాలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదోడి ప్రభుత్వమని, రైతు రాజ్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. పెదవాగు పాజెక్టులోకి ఒక్కసారి 70వేల క్యూసెక్కుల వరద రావడంతో కట్టకు భారీ గండి పడిందన్నారు. మూడో గేటు ఎత్తి ఉంటే ప్రమాదం జరిగి ఉండేది కాదన్నారు. అధికారులు మరింత జాగ్రత్తలు పాటించి ఉండివుంటే ప్రమాదం తప్పేదని మంత్రి అభిప్రాయపడ్డారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అధికారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. వరదలతో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ, పీఆర్ రహదారుల మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం పునరుద్దరణకు రూ.8.50కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ ప్రాంతంలో 400ఎకరాల్లో ఇసుక మేటలు వేసినట్టు ప్రాథమిక సర్వేలో తేలిందని, ఆయా భూముల్లో ఇసుక మేటలను తొలగించేందుకు ఎకరానికి రూ.10వేలు సహాయం, ఉచితంగా విత్తనాలు సరఫరా చేస్తున్నట్టు మంత్రి పొంగులేటి ప్రకటించారు.

వరదల్లో కొట్టుకొని పోయిన గొర్రెలు, మేకలకు ఒక్కోదానికి రూ.3వేలు, పశువులకు ఒక్కోదానికి రూ.20వేలు అందిస్తామన్నారు. వరదలో చిక్కుకున్న 31మందిని కాపడడంతో ఏపీ ప్రభుత్వ సహకారం మరిచిపోలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వంనుంచి వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ప్రాజెక్టు లోతట్టు 1,100 ఎకరాల్లో ఆక్రమణలు జరిగాయని రైతుల ఫిర్యాదుకు స్పందించిన మంత్రి తక్షణమే సర్వే చేసి ఆక్రమణలు తొలగించి బౌండింగ్ మార్క్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం మండలంలో పెదవాగు వరదతో దెబ్బతిన్న గుమ్మడపల్లి, కొత్తూరు గ్రామాల్లో నిర్వాసితులను మంత్రి పరామర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, ఇరిగేషన్ సీఈ

(మిగతా 7వ పేజీలో)

పలువురు సీఐల బదిలీ

ఖమ్మం క్రైం, జూలై 22: ఖమ్మం జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లకు బదిలీపై నూతన సీఐలను నియమించారు. రఘునాథపాలెం ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న తుమ్మలపల్లి శ్రీహరిని మహిళా పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. ఇక్కడ సీఐగా ఉన్న వేణు ములుగు జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే రఘునాథపాలెం ఎస్‌హెచ్‌వోగా వరంగల్ కమిషనరేట్‌లో సీఐగా ఉన్న ఉస్మాన్‌షరీఫ్‌ను నియమించారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా ఖమ్మం వీఆర్‌లో సీఐగా ఉన్న బరపటి రమేష్‌ను మల్టీజోన్-1కు బదిలీ చేశారు. రామగుండం కమిషనరేట్‌లో సైబర్ క్రైం-1 సీఐగా ఉన్న ముత్తి లింగయ్యను సత్తుపల్లి రూరల్‌కు బదిలీ చేశారు.

విమానాశ్రయాలు ఏర్పాటు చేయండి

పార్లమెంట్‌లో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి



ఖమ్మం, జూలై 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణలో రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఒక్కటే ఉందని, కొత్తగా మూడు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు, మూడు బ్రౌన్ ఫీల్డ్ విమానాశ్రయాలు నిర్మించాల్సిన అవసరం ఉందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి లోక్‌సభలో కోరారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం కాగా ఎంపీ మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం, జక్రాన్‌పల్లి, నిజామాబాద్ జిల్లా, మహబూబాబాద్ జిల్లాల్లో నిర్మించాల్సి ఉందని తెలిపారు. బ్రౌన్ ఫీల్డ్‌కు సంబంధించి మామునూరు-వరంగల్ అర్బన్ జిల్లా, బాసత్‌నగర్ పెద్దపల్లి జిల్లా, ఆదిలాబాద్ జిల్లాలో వినియోగంలోకి తేవాలని కోరారు. హైదరాబాద్ నుంచి ఎక్కువదూరంలో ఉన్న జిల్లాల కోసం కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని గుర్తుచేశారు.



పాలేరులో ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులు

మాకు టీచర్లనివ్వండి...

- పాలేరులో రోడ్డెక్కిన పాఠశాల విద్యార్థులు
- టీచర్లు పాఠశాలకు రాకుండా ఉదయాన్నే తాళం
- నలుగురు టీచర్లను కేటాయిస్తూ డీఈవో ఉత్తర్వులు

6



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

'ప్రజావాణి' ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి...

- అర్జీల స్టేటస్‌ను పారదర్శకంగా తెలపాలి: ముజమ్మిల్ ఖాన్
- ప్రజల నుంచి స్వయంగా ఫిర్యాదుల స్వీకరణ

7

ఆత్మలకూ పింఛన్లు..!

- మరణించిన వారికి రద్దు కాని 'ఆసరా పథకం'
- వారి ఖాతాల్లో జమ అవుతున్న నగదు
- ఏటీఏం కార్డులతో డబ్బు తీసుకుంటున్న బంధువులు

నేలకొండపల్లి, జూలై 22: ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పింఛన్లు దుర్వినియోగమవుతున్నాయి. ఆత్మలకూ పింఛన్లు ఇస్తున్నారు. మృతి చెందిన వారికి పింఛన్ రద్దు చేసి.. అర్హత ఉన్న వేరే వారికి ఇవ్వాల్సి ఉన్నా.. నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో పింఛన్ పొందే వ్యక్తి మృతి చెందినప్పటికీ, ఏటీఎం కార్డు ద్వారా పెన్షన్ డబ్బును సంబంధికులు బ్యాంకు నుంచి డ్రా చేసుకుంటున్నారు.

నేలకొండపల్లికి చెందిన ఓ మహిళ మృతి చెంది పదేళ్లు కావస్తోంది. అయినా ఇంకా ఆమె బ్యాంకు ఖాతాలో డబ్బు జమవుతూనే ఉంది. ఏటీఎం కార్డు ఉండటంతో కుటుంబీకులు బ్యాంకు నుంచి డ్రా చేస్తున్నారు. ఏటీఎం కార్డు కాల పరిమితి తీరిపోవటంతో డ్రాచేయటం కుదరటం లేదు.

దీంతో మృతురాలి ఖాతాలో దాదాపుగా రూ.1.50 లక్షలకు పైగానే ఉన్నట్లుగా తెలుస్తోంది. 2017 నుంచి ఖాతా నుంచి డబ్బు డ్రాచేయటం లేదని సమాచారం.

ఇటీవలనే మృతురాలి ఖాతాలో ఉన్న నగదును క్లెయిమ్ చేస్తూ బ్యాంకుకు అన్ని పేపర్లతో దరఖాస్తు చేసుకున్నారు. మృతురాలికి సంబంధించిన వారు నగదు కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతుండటంతో, ఆనోటా ఈనోటా పడి బయటకు పొక్కటంతో అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు.



జనవరి 2024లో మృతి చెందినట్లు సర్టిఫికెట్

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే సదరు మహిళ 2024 జనవరి14న మృతి చెందినట్లు నేలకొండపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి డెత్ సర్టిఫికెట్ జారీ చేసినట్లుగా తెలుస్తున్నది. ఎంపీడీవో కార్యాలయం నుంచి సైతం మృతురాలి కుటుంబానికి పెన్షన్ డబ్బును చెల్లించాలని సర్టిఫికెట్ ఇచ్చినట్లుగా సమాచారం.

మృతి చెంది సంవత్సరం అవుతున్నా...

నేలకొండపల్లి శ్రీభక్తరామదాసు మందిరం ఎదురుగా ఉన్న సందులో ఓ వ్యక్తి మృతి చెంది దాదాపుగా సంవత్సరం అవుతున్నప్పటికీ పెన్షన్ అందుతూనే ఉన్నట్లుగా సమాచారం.

ఈ విషయమై ఎంపీడీవో ఎర్రయ్యను వివరణ కోరగా.. చనిపోయిన వారి ఖాతాల్లో ఉన్న డబ్బును రికవరీ చేశామన్నారు. డెత్ సర్టిఫికెట్ జారీ గురించి విచారణ చేస్తామని తెలిపారు.

'ఎగ్'స్ట్రా దోపిడి

- మధ్యాహ్న భోజనంలో అందని కోడిగుడ్లు
- కొన్ని బడుల్లో రాగి జావ కూడా బంద్
- సాకుతో చేతివాటం ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 22: ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం వారంలో మూడు రోజులు కోడిగుడ్డు, మరో మూడు రోజులు రాగి జావ అందించాల్సి ఉంది. కాని 2024-25 విద్యా సంవత్సరం



మెను పాటించకుండానే పగటి భోజనం అందజేస్తున్న నిర్వాహకులు

ప్రారంభం నుంచి కొన్ని పాఠశాలల్లో కోగుడ్డు లేకుండానే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. నెల రోజులుగా కొన్ని పాఠశాలల్లో రాగి జావ కూడా ఇవ్వడం లేదు.

బిల్లులు ఫుల్.. మెనూ నిల్..

హాజరు శాతాన్ని బట్టి మధ్యాహ్న భోజన బిల్లులు చేస్తున్న హెచ్ఎంలు మెనూ మాత్రం పాటించడం లేదు. కొందరు చిన్నారులు ఇళ్లనుంచి భోజనం తెచ్చుకుంటున్నారు. వారికి గుడ్లు ఇవ్వడం లేదు. అయితే వారికి కూడా ఇచ్చినట్లు లెక్కల్లో చూపుతున్నారు.

ఇంటి భోజనానికి గుడ్డు కట్..

సోమవారం నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా నగరంలోని ఇందిరానగర్ పాఠశాలలో 7వ తరగతి చదివే పలువురు విద్యార్థులు ఎక్కువ మంది ఇంటి నుంచే భోజనాలు తెచ్చుకొని తింటున్నారు. వారిని గుడ్డు ఏదని అడుగగా ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే వారికి గుడ్డు పెట్టరని తెలిపారు. పాఠశాల మొత్తంలో 30 మంది వరకు ఇంటి నుంచే భోజనం తెచ్చుకోని తింటున్నారు. రోటనీనగర్ ప్రభుత్వ పాఠశాలలో గుడ్డు లేకుండానే పగటి భోజనం పూర్తి చేస్తున్నారు. ఇందేంటని ప్రశ్నిస్తే ఈ రోజు ఆటోలో గుడ్లు రాలేదని సమాధానం ఇచ్చారు.

నిబంధనలు బేఖాతర్..

ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య ఆధారంగా బిల్లులు అందించడంతో పాటు భోజనం చేసే విద్యార్థుల ఫొటోలను



మధ్యాహ్న భోజనంలో కోడి గుడ్డు ఇవ్వని దృశ్యం

యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. విద్యాశాఖ మెనూ ప్రకారం ప్రతి విద్యార్థికి వారంలో రోజు విడిచి రోజు మూడు రోజులు కోడిగుడ్లు ఇవ్వాల్సి ఉంది. కానీ వాస్తవానికి వారం రోజులుగా కోడిగుడ్డు లేకుండానే భోజనం పెడుతున్నారు. నగరంలోని పలు ఏజెన్సీలు పాఠశాల విద్యార్థులకు అందిచాల్సిన మధ్యాహ్న భోజనంలో కేవలం ఒక కూరను మాత్రమే ఇస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థులందరికి బిల్లులు చెల్లిస్తున్నప్పటికి ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం కొందరికే భోజనాలు అందిస్తున్నారు.

పౌష్టికాహారం పేరుకేనా

జిల్లావ్యాప్తంగా ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్ అన్నీ కలిపి 1చ184 ఉండగా అందులో 55వేల 294 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. కాగా వారంలో మూడు రోజులు కోడిగుడ్డు, మూడు రోజులు రాగి జావ అందిచాల్సి ఉండగా ప్రస్తుతం విద్యార్థులకు ఏది అందకుండానే కేవలం ఒక కూరతోనే సరిపెడుతున్నారు.



ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలంటూ కలెక్టర్‌కు సూచిస్తున్న మంత్రి

ఉపాధ్యాయులు లేక చదవులు సాగటం లేదు

- మంత్రి పొంగులేటి ఎదుట వాపోయిన విద్యార్థులు
- రెండు రోజుల్లో ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు

అశ్వారావుపేట రూరల్, జూలై 22: బడిలో పాఠాలు చెప్పటానికి సరిపడా ఉపాధ్యాయులు లేకపోవటంతో చదువులకు దూరం అవుతున్నామని, తమకు ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి తమ సమస్యను తీర్చాలని రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరరెడ్డిని విద్యార్థులు కోరారు. అందుకు స్పందించిన మంత్రి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. మండలంలోని గుమ్మడివల్లి ఉన్నత పాఠశాలలో 135 మంది విద్యార్థులు ఉండగా కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. దీంతో కొద్దిరోజుల క్రితం చిన్నారులు రోడ్డెక్కి ఆందోళన కూడా చేశారు. ఇదే తరుణంలో సోమవారం రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాసరరెడ్డి గుమ్మడివల్లిలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చారు. పాఠశాలకు విద్యార్థులు మంత్రి పొంగులేటిని కలిసి తమ పాఠశాలలో పరిస్థితి దారుణంగా ఉందని, ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యకు స్పందించిన మంత్రి పొంగులేటి కలెక్టర్‌ను జితేష్ వి పాటిల్‌ను పిలిచి మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా రెండు మూడు రోజుల్లో ఉపాధ్యాయుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మంత్రి పొంగులేటి చిన్నారులతో ముచ్చటించారు. కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- ట్రెయినీ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట


చింతకాని, జూలై22: విద్యార్థులు ఇష్టపడి చదవాలని ట్రెయినీ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట అన్నారు. సోమవారం చింతకాని, లచ్చగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. పాఠశాలల్లో బోధన, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో వసతులను పరిశీలించారు. డిజిటల్ పాఠాల బోధన, చదవడం, రాయడం, పఠన తీరుపై విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, కార్యదర్శులు సైదులు, శ్రీరాం, పాల్గొన్నారు.

సిటీబస్టాండ్‌లో డైనింగ్‌హాల్ ప్రారంభం

ఖమ్మం ఖానాపురంహవేలీ, జూలై22: విధినిర్వహణ సమయంలో భోజనం చేయటానికి సిబ్బంది పడుతున్న ఇబ్బందులను తీర్చటంకొరకు ఖమ్మం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరాం నగరంలోని సిటీబస్టాండ్‌లో డైనింగ్‌హాల్‌ను సోమవారం ప్రారంభించారు. గత రెండు సంవత్సరాలుగా విధినిర్వహణలో ఉన్న డ్రైవర్లు,కండక్టర్లు భోజనం చేసేందుకు సరైన సౌకర్యంలేక బస్సులలో కూర్చొని భోజనం చేస్తున్నారు. దీంతో ఆర్ఎం స్పందించి సిబ్బందికి ప్రత్యేకంగా డైనింగ్‌హాల్‌ను ఏర్పాటు చేశారు. సిబ్బంది ఆర్ఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపోమేనేజర్ దినేష్‌కుమార్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇటు పెదవాగు...అటు గోదావరి

- మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన



గొమ్మూరు వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం, జూలై22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారీవర్షాలతో గండిపడిన పెదవాగు ప్రాజెక్టు ప్రాంతం, గోదావరిలో పెరుగుతున్న వరద ప్రాంతాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం విస్తృతంగా పర్యటించారు. మరోవైపు తననియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. మంత్రి పొంగులేటి అశ్వారావుపేట మండలంలోని పెదవాగు గండిని పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. ఇసుకమేటలు వేసిన రైతులకు ఎకరానికి రూ.10వేలు సహాయం అందిస్తామని, రైతులకు అవసరైన విత్తనాలు, పంటసాయం కూడా అందిస్తామని భరోసా ఇచ్చారు. మేకలు, పశువులకు కూడా పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు.పెదవాగు ప్రాజెక్టు గండికి గల కారణాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులుతో మట్లాడి ఇళ్లు కోల్పోయి వారికి ఇందిరమ్మ ఇళ్ల ఇస్తామని హామీ ఇచ్చారు. పెదవాగు వరద నష్టాన్ని పరిశీలించిన అనంతరం గోదావరి వదరలపై భద్రాచలంలో సమీక్షించారు. వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లిలో ప్రహరీగోడ నిర్మాణ పనులకు, రహదారుల పనులకు శంకుస్థాపన చేశారు.

నిధుల కొరత లేదు..

- వరద బాదితులకు సేవలందించండి
- తేడా వస్తే బాధ్యులపై సస్పెన్షన్ వేటు
- గోదావరి వరద సమీక్షలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

భద్రాచలం, జూలై 22: భద్రాద్రి ఏజెన్సీలోని వరద బాధితులకు అధికారులంతా సమన్వయంతో సేవలందించాలని, అవసరమైన నిదులను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాచలంలో సోమవారం ఆయన గోదావరి వరదను పరిశీలించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో వరద పరిస్థితి, సహాయక చర్యలపై సమీక్షించారు. గతంలో వరద బాధితులకు అందించిన ఆహారం విషయంలో అనేక విమర్శలు వచ్చాయని, ఈసారి అలాంటి పరిస్థితి ఉండకూడదన్నారు. వరద బాధితులకు రుచి, శుచికరమైన ఆహారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం వద్ద గోదావరి 55 అడుగులకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారని, ఈ నేపథ్యంలో అధికారులు సర్వం సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి పీహెచ్‌సీలో అత్యవసరమైన మందులు సిద్ధం చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో భాస్కర్‌ను ఆదేశించారు. వైద్యశాఖలో ఇటీవల బదిలీలైన క్రమంలో కొన్ని చోట్ల ఇబ్బందులు ఉన్నాయని, వాటిని మూడు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ వరద బాధితులకు అందజేసే ఆహార విషయమై ప్రత్యేక బాధ్యులను నియమించామన్నారు. వరద బాధితులకు అందించే ఆహారం విషయంలో లోపాలు ఉంటే బాధ్యులపై సస్పెన్షన్ వేటు పడుతుందని అధికారులకు స్పష్టం చేశారు. అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగు ఘటన నేపథ్యంలో విద్యుత్ అధికారుల పనితీరు అభినందనీయమని ఆ శాఖ ఎస్ఈ బీకామ్ సింగ్‌ను మంత్రి పొంగులేటి అభినందించారు.



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి



గోదావరి వరద ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

ఈ సమీక్షలో ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్‌రావు, ఆదినారాయణ, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆర్డీవో దామోదర్‌రావు, ఏఎస్పీ అంకిత్‌కుమార్ శంకార్, ఎస్ఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వరద సమాచారం కోసం కలెక్టర్ కొత్త ప్రయోగం

గోదావరి పరీవాహక ప్రాంతంలోని మండలాల్లో సత్వర వరద సమాచారం సేకరించేందుకు భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ సరికొత్త ప్రయోగాన్ని చేపట్టారు. ప్రతి గ్రామంలో చురుగ్గా వ్యవహరించే ముగ్గురిని గుర్తించి వారినుంచి సమాచారం సేకరణకు చర్యలు చేపడుతున్నారు. సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఏదైనా కారణంతో అందుబాటులోకి రాలేకపోతే తాము గుర్తించిన వ్యక్తుల నుంచి సమాచారాన్ని సేకరించి అందుకు అనుగుణంగా సహాయక చర్యలు చేపట్టనున్నారు. వరదల సమయంలో ప్రతి రోజు ఉదయం 9గంటలకు, సాయంత్రం 4గంటలకు జిల్లా అధికార యంత్రాంగం ఈ కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు సమీక్ష సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడించారు.

మాకు టీచర్లనివ్వండి

- రోడ్డెక్కిన పాఠశాల విద్యార్థులు

కూసుమంచి, జూలై 22: 'విద్యాసంవత్సరం ప్రారంభం అయి రెండునెలలు కావస్తుంది.. కానీ సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే సరిపడా ఉపాధ్యాయులను నియమించాలి..' అంటూ చిన్నారులు రోడ్డెక్కారు. ఖమ్మంజిల్లా కూసుమంచి మండలం పాలేరు ఉన్నత పాఠశాలగతేడాది ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయింది. 200 మందికిపైగా విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. ప్రారంభించిన మొదటి ఏడాదే టెన్త్‌లో నూరుశాతం ఉత్తర్ణీత సాధించి మండలంలోనే మన్ననలు పొందింది. అయితే ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న నలుగురు ఉపాధ్యాయులను బదిలీ చేశారు. దీంతో ఇటీవల మాజీ సర్పంచ్ యడవల్లి రమణారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి ఉపాధ్యాయుల కొరతపై వినతిపత్రం అందించారు. డీఈవోను కలిసి సమస్యను వివరించారు. అయినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడంతో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఉదయాన్నే టీచర్లను లోనికి రానీయకుండా గేటు తాళాలు వేసి ఆందోళన నిర్వహించారు.ఖమ్మం-సూర్యాపేట ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. గంటకుపైగా ఆందోళన నిర్వహించారు. దీంతో విలేకరులు సమస్యను డీఈవో దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే దిగివచ్చిన డీఈవో మధ్యాహ్ననికి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మధ్యాహ్ననికి నలుగురు ఉపాధ్యాయులను కేటాయిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

'ఆశా'ల సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ఆశాకార్యకర్తల ఆందోళన

ఖమ్మం కలెక్టరేట్, జూలై 22: కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలు అమలుచేయాలని, ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆశాకార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనకు సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18,000 లు ఇవ్వాలని,పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.

అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు అందించారు. ఈ ఆందోళనలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్, యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జై మంగమ్మ, బి. అమల జిల్లా నాయకులు రమణ, నాగమణి, ప్రమీల, రాధా, కళ్యాణి, జ్యోతి, కమల విజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలి

తల్లాడ, జూలై22: జీవోను సవరించి అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేయాలని కౌలురైతుసంఘం రాష్ట్ర కన్వీనర్ మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం తల్లాడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డు ఉన్న వారికే రుణమాఫీ వర్తిస్తుందని నిబంధన పెట్టడం సరైంది కాదన్నారు. వెంటనే ఈ జీవోను సవరించాలన్నారు. ఖమ్మం జిల్లాలో ఐదులక్షల మందికిపైగా రైతులుంటే రూ.లక్ష లోపు రుణమాఫీ 57,375మందికి వచ్చిందని, సుమారు మూడులక్షల మంది రైతులకు రుణమాఫీ రావల్సి ఉందన్నారు. రుణమాఫీ చేశామని ప్రచార ఆర్భాటం తప్ప రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. అర్హత కల్గిన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతుసంఘం జిల్లా కన్వీనర్ శీలం సత్యనారాయణరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు, నాయకులు నల్లమోతు మోహన్‌రావు, చల్లా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్త న్యాయచట్టాల్లో సవరణ చేయాలి

రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర కు ఖమ్మం బార్ సభ్యుల వినతి

ఖమ్మం లీగల్ జూలై 22: కొత్తన్యాయ చట్టాల్లో సవరణతోపాటు సెంట్రల్ నోటరీ పబ్లిక్ అపాయింట్మెంట్స్, అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు తదితర అంశాలపై రాజ్యసభలో బీఆర్ఎస్ తరఫున మాట్లాడలని ఖమ్మం బార్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం ఢిల్లీలో ఆ పార్టీ పార్లమెంట్ డిప్యూటి లీడర్ వద్దిరాజు రవిచంద్ర ను కోరారు. తాళ్లూరి దిలీప్ చౌదరి ఆధ్వర్యంలో ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, సంక్రాంతి రాజశేఖర్ తదితరులు కలిశారు. ఢిల్లీలో పలువురు ఎంపీలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిపై కేంద్ర న్యాయశాఖామంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ కు బీఆర్ఎస్‌పార్టీ పక్షాన లేఖ రాయటంతోపాటు సభలో ప్రస్తావన కూడా తెస్తానని, సెంట్రల్ నోటరీస్ లను కాల్‌ఫర్ చేయాలిని న్యాయవాదులు ఎంతో కాలంగా పోరాడుతున్న విషయాన్ని ఎంపీ రవిచంద్ర ఈ సందర్భంగా ప్రస్తావించారు. అడ్వకేట్ ప్రొటక్షన్ బిల్ మీద కూడా మాట్లాడతానని రవిచంద్ర హామీ ఇచ్చారని వారు ఒక ప్రకటనలో తెలిపారు.



ఎంపీకి వినతిపత్రం సమర్పిస్తున్న న్యాయవాదులు



రాయల చంద్రశేఖర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న తమ్మినేని

రాయల కుటుంబానికి పరామర్శ

తిరుమలాయపాలెం, జూలై22: ఇటీవల మృతిచెందిన సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నేత రాయల చంద్రశేఖర్ కుటుంబాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సోమవారం పరామర్శించారు. మండలంలోని పిండిప్రోలు గ్రామంలో రాయల కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈసందర్భంగా రాయల చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రశేఖర్ మరణం విప్లవోద్యమాలకు తీరనిలోటన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, పప్పుల ఉపేందర్, యల్లంపల్లి నాగయ్య, రాయల రవికుమార్, రాయల రాజా, తమ్మినేని ఉమ, వై. నవీన్, వెంకటస్వామి, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తాతా మధు, మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య, జడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

రైతు ఆత్మహత్యకు కారకులను శిక్షించండి

- కలెక్టర్‌కు బీఆర్ఎస్ నేతల వినతి

ఖమ్మం కలెక్టరేట్, జూలై 22: చింతకాని మండలం, పొద్దుటూరు గ్రామంలో రైతు ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని టీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు తాతా మధుసూదన్, సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ కలెక్టర్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ని టీఆర్ఎస్ నాయకులు కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రైతు వీడియో తీసుకుని మరీ ఆత్మహత్యకు పాల్పడ్డారని ఈ సంఘటనపై పలు అనుమానాలను కుటుంబీకులు వ్యక్తం చేసినా అధికారులు, పోలీసులు పట్టించుకోవాడం లేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పాము కాటుతో వైద్యం పొందేందుకు వెళ్లిన రైతు పట్ల నిర్లక్ష్యం వహించిన సంఘటనపై విచారణ జరిపించాలని వారు కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం ఉన్నారు.



రోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఆర్ఎంపీలు వైద్యం చేస్తే చర్యలు

- డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం

వేంసూరు, జూలై 22: గ్రామాల్లో గ్రామీణ వైద్యులు(ఆర్ఎంపీ) వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం హెచ్చరించారు. పలువురి ఫిర్యాదు మేరకు సోమవారం మర్లపాడులోని పలు ఆర్ఎంపీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం సీజన్ దృష్ట్యా ప్రజలెవరూ ఆర్ఎంపీ వైద్యులను సంప్రదించకుండా ఆయా పీహెచ్‌సీల్లో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 70రకాలకు సంబంధించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండు, మూడురోజులు జ్వరం వస్తే వెంటనే పీహెచ్‌సీల్లో పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు తీసుకోవాలన్నారు. రోగులు గ్రామీణ వైద్యులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవాలన్నారు. ఇదిలా ఉంటే వైద్యం చేస్తున్న ఓ ఆర్ఎంపీకి నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలేరును కరుణించని వరుణుడు

- జాడలేని వర్షాలు..
- వెలవెలబోతున్న చెరువులు
- సాధారణ వర్షపాతమే నమోదు

కూసుమంచి, జూలై 21: వారం రోజులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు దంచి కొడుతున్నాయి. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి.. కానీ పాలేరు నియోజకవర్గంలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది. మూడు రోజులుగా కేవలం చిన్న పాటి జల్లులకే తుంపర్ల వర్షమే కురుస్తోంది. ఫలితంగా నియోజకవర్గంలోని కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్ మండలాల్లోని చెరువుల్లోకి కనీసం నీరు చేరక వెలవెలబోతున్నాయి. జూన్, జూలై మాసాల్లో సాధారణ వర్షపాతం కూడా నమోదు కావడం లేదు. నియోజకవర్గంలో మొత్తం వర్షాధారంగానే వ్యవసాయం చేస్తుంటారు. సాధారణ వర్షపాతం కంటే మించి వర్షాలు పడితేనే చెరువులు కుంటల్లోకి నీరు చేరుతేనే భూగర్భజలాలు పెరిగి బోర్లు, బావుల్లోకి నీరు వస్తుంది. కానీ ఈఏడాది వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నప్పటికీ నేటికీ జల కాల్వల్లోకి మళ్లేంత వర్షం రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పాలేరు డివిజన్‌లో అధికంగా పత్తి, మిర్చి, వరి పంటలు సాగుచేస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి విత్తనాలు విత్తడంతో అవి మొలకెత్తాయి. చెదురుమదురు వర్షాలు వల్ల మెట్టపంటలకు ఊరట నిస్తున్నపటికీ తర్వాత ఇబ్బందులు తప్పవని రైతులు అంటున్నారు. నీటివసతి కొద్ది గొప్ప ఉన్న రైతులు బోర్లు బావులకింద ధైర్యం చేసి వరి నాట్లు వేస్తున్నారు. గత ఏడాది కూడా చెప్పుకోదగిన వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటాయి. ఈఏడాది కూడా ఇదేపరిస్థితి ఉంటే ఇబ్బందులు తప్పని పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు సరిగా కురవని పక్షంలో పంటల దిగుబడులు తగ్గుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఇక ఆగస్టు నెలపైనే అంచనా వేస్తున్నారు. భారీ వర్షాలు కురవాలని రైతులు వరుణ దేవుడికి మొక్కుతున్నారు.

జూలై నెలలో వర్షపాతం మి.మీ.లలో

మండలం	కురిసింది	కురవాల్సింది
ఖమ్మంరూరల్	469.9	273.2
తిరుమలాయపాలెం	394.5	259
కూసుమంచి	337.7	248.6
నేలకొండపల్లి	346.3	268.1


వెలవెలబోతున్న గంగాదేవి చెరువు, అరకొరనీటితో శనగకుంట

వదలని వాన.. తగ్గని వరద ఉధృతి

- బూర్గంపాడు-సోంపల్లి గ్రామాలకు నిలిచిన రాకపోకలు

బూర్గంపాడు, జూలై 22: వారం రోజులుగా వదలని వాన...మరో వైపు గోదావరి వరద ఉధృతిలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. గ్రామాలలోని చెరువులు, వంకలు అలుగులు పడ్డాయి. సోమవారంసైతం వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షంతో పాటు గోదావరి వరద ఉధృతితో కిన్నెరసాని వాగు ఎగపోటు వేసింది. దీంతో సోంపల్లి, బూర్గంపాడు, రెడ్డిపాలెం గ్రామాలలోని పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. గోదావరి వరదతో పాటు కిన్నెరసాని ఉధృతితో మండల కేంద్రానికి మూడు వైపులా వరద పోటెత్తడంతో జలదిగ్భందంలో ఉండిపోయింది. కిన్నెరసాని ఎగపోటుతో బూర్గంపాడు-సోంపల్లి రహదారిపైకి నీరు చేరాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని బూర్గంపాడు మండల పరిధిలో ఐదు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ముజాహిద్ తెలిపారు. లోతట్టు ప్రాంతాలను జడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, ఎంపీడీవో జమలారెడ్డి పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


బూర్గంపాడు-సోంపల్లి రహదారిపై చేరిన వరద నీరు

10 అడుగులకు చేరిన పాలేరు నీటిమట్టం

కూసుమంచి, జూలై 22: పాలేరు జలాశయం నీటిమట్టం గణనీయంగా పెరుగుతోంది. 23 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి గాను 10 అడుగులకు చేరుకుంది. సాగర్ డ్యామ్‌నుంచి 4వేల క్యూసెక్కుల నీరు వదులుతుండగా పాలేరుకు 3,240 క్యూసెక్కుల నీరు చేరుతోంది. పాలేరు జలాశయాన్ని పూర్తిస్థాయి నీటిమట్టానికి నీరు నిల్వచేయనున్నట్లు ఐబీ అధికారులు తెలిపారు.

వైరా ప్రాజెక్టుకు జలకళ

వైరా, జూలై22: వైరారిజర్వాయర్ నీటిమట్టం స్వల్పంగా మాత్రమే పెరిగింది. సోమవారం సాయంత్రానికి 11.6 అడుగులకు చేరుకుంది. ఆదివారం నాటికి 11.3 అడుగులకు పెరిగిన నీటిమట్టం కేవలం మూడు అంగుళాలు మాత్రమే వరదనీరు రావడంతో సోమవారం సాయంత్రానికి 11.6 అడుగులకు పరిమితమైంది. రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురవకపోవడంతో వరదనీటి ప్రవాహం తగ్గిపోయింది. నీటిమట్టం పెరగకపోవడంతో ఆయకట్టు రైతులు నిరాశ నిస్పృహలకు లోనయ్యారు.

పెద్దచెరువు కట్టకు బుంగ

కల్లూరు, జూలై 22 ఇటీవల ఎడతెరిపి లేకుండ కురుస్తున్న వర్షాలతో కల్లూరులోని ప్రధాన జలవనరైన పెద్దచెరువు కట్ట(తారురోడ్డు) వెలుపల భాగంలో బుంగ పడింది. చెరువకట్ట ఇలా కోతకు గురియైన ఇంత వరకు అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవటంతో ఆయుకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

గత ఎనిమిది నెలలుగా కట్ట కోతకు గురియైన ప్రదేశంలో ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకొని పరిస్థితి. కట్ట బయట భాగంలో అంచున కోతకు గురైన ప్రదేశంలో ప్రమాదాలు జరగకుండా తాత్కలికంగా ముళ్ల కంచేను అడ్డంగా వేశారు. అశ్వారావుపేట వద్ద పెద్దవాగు చెరువు తెగిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. ఇలాంటి ఘటనలు జరగకుండ ముందస్తు జగ్రత్తగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


వికలాంగురాలి గోడును వింటున్న కలెక్టర్

'ప్రజావాణి' ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- అర్జీల స్టేటస్‌ను పారదర్శకంగా తెలపాలి
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ప్రజల నుంచి స్వయంగా ఫిర్యాదుల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, జూలై 22: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలకు పరిష్కారం, తిరస్కరణకు గురైతే, అర్జీదారునికి కారణం తెలపాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిష్కారానికి ఆదేశిస్తూ సంబంధిత అధికారులకు కలెక్టర్ సిఫారస్ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, డీఆర్డీవో సన్యాసయ్య, జడ్పీ సీఈవో ఎస్.వినోద్, జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అందిన ఫిర్యాదుల్లో కొన్ని...

- కూసుమంచి మండలం, జీళ్లచెరువు గ్రామానికి చెందిన అంబాల నరసయ్య, గ్రామంలో ఇళ్ల స్థలాలకు తాను భూమి ఇచ్చినట్లు, తనకు 3 ప్లాట్లు కేటాయించి, పట్టా ఇవ్వాలని కోరడంతో కలెక్టర్ స్పందించి కూసుమంచి తహసీల్దార్‌ని ఆదేశించారు.
- నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామం నుంచి పొట్టపింజర మాధవి, తన ఇల్లు (నెం. 1-57) ఈ నెల 16న వర్షాలకు కూలిపోయిందని తనకు ఆర్థిక సహాయాన్ని చేసి ఆదుకోవాలని అర్థించింది.
- ఏన్కూరు మండలం నాచారం నుంచి కాట్రగడ్డ లలిత, తన రేషన్‌కార్డ్ రిజెక్ట్ అయిందని తనకు రేషన్‌కార్డును మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరింది.
- చింతకాని మండలం రామకృష్ణాపురం నుంచి శనిగవరపు శ్రీనివాస్, తాను ప్రజాపాలన కింద గృహజ్యోతికి దరఖాస్తు చే శానని తనకు ఉచిత విద్యుత్ వచ్చేలా చేయాలని కోరారు.
- కొణిజర్ల మండలం అమ్మపాలెం నుంచి ఉసికల చిన్నిరాములు, తనకు దళితబంధు మంజూరు రెండో విడత మొత్తం ఇప్పించాలని దరఖాస్తుచేశారు.
- పి.చంద్రకళ, జూనియర్ లెక్చరర్, తాను మధిర నుంచి ఖమ్మం బదిలీ అయినట్లు, కేంద్రీయ విద్యాలయంలో తన పిల్లలకు సీట్లు ఇప్పించాలని కోరగా, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్‌ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.
- రాష్ట్ర శాసనసభలో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో ఖమ్మం జిల్లాలో అనేక ప్రాజెక్టులకు సంబంధించి నిధులు సాధించాలని తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు కొండబాల కరుణాకర్ కోరారు. సీతారామ ప్రాజెక్టు కాలువను జూలూరుపాడు నుంచి పాలేరు వరకు తవ్వాలని, మొత్తం ప్రాజెక్టు పొడవున పంట కాలువలు తవ్వేందుకు రూ.20వేల కోట్లు కేటాయించాలని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వివక్షకు గురైన కామేపల్లి మండలంలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేయాలని, ఎన్టీఆర్ సర్కిల్‌లో ఫై ఓవర్ నిర్మించాలని కోరారు. ఆయన వెంట లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, జిల్లా నాయకులు పాలడుగు కృష్ణప్రసాద్, సొసైటీ మాజీ అధ్యక్షుడు గుడిపూడి వెంకటేశ్వరావు, మీగడ రామారావు, కర్నాటి అశ్విని కుమార్ పాల్గొన్నారు.
- సింగరేణి మండలం కారేపల్లి గ్రామం నుంచి పి.మహేష్, తాను దివాంగుడిని అని చేయూత పెన్షన్ మంజూరు చేయాలని కోరారు
- చింతకాని మండలం నాగులవంచ గ్రామం నుంచి నెల్లూరి ఇంద్ర, తన భర్త శ్రీనివాసరావు నవంబర్ 2014లో చనిపోయాడని తనకు చేయూత పెన్షన్ మంజూరు చేయాలని కోరింది.
- ఖమ్మం అర్బన్ మండలం పుట్టకోట గ్రామం నుంచి బొడా బాబు, సర్వే నెం. 39లో 12 కుంటల భూమి, తన అనుమతి లేకుండా భూక్యా మాదా పేరుపై వచ్చిందని, ఆ పాస్‌బుక్ రద్దు చేసి తన పేరుతో పాస్ పుస్తకాన్ని ఇవ్వాలంటూ వేడుకుంది.
- ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం గ్రామం నుంచి టీచర్స్ కాలనీ వాసులు, సర్వే నెం. 165/అ, 166/ఆలో అనుమతి లేకుండా, సెట్‌బ్యాక్ లేకుండా జి ప్లస్ 4నిర్మాణం చేస్తున్నారంటూ పిర్యాదు చేశారు.
- పుట్టకోట గ్రామం, ఖమ్మం అర్బన్ మండలం నుంచి చిన్నంశెట్టి రామారావు.. తాను మరుగుజ్జునని, ఏ పని చేయలేనని ఉపాధికల్పనకు కోరగా జిల్లా ఉపాధి కల్పన అధికారిణిని తగుచర్యకు ఆదేశించారు.
- తల్లాడ మండలం మల్సూర్ తాండ గ్రామానికి చెందిన భూక్యా రాజగోపాల్.. తనకు మీసేవ కేంద్రం మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ ఇడిఎంని పరిశీలించాలని ఆదేశించారు. స్థానిక శ్రీనివాస నగర్ నుంచి యు.దేవి, తనకు జీవో 58 ద్వారా ఇంటి స్థలం ఇచ్చారని, ఆ స్థలంలో ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరగా... తగు చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవోని ఆదేశించారు.


గుమ్మడపల్లిలో బాధితుడిని పరామర్శిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

'పెదవాగు' బాధితులకు అండగా ఉంటాం

(5వ పేజీ తరువాయి)

శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెదవాగు వరదతో ఇళ్లు కోల్పోయినవారికి, పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. గుమ్మడివల్లిలో వరదతో దెబ్బతిన్న ఇళ్లను, పొలాలను మంత్రి పరిశీలించారు. పంటలు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు కోల్పోయిన బాధితులతో మాట్లాడారు. ఒకపక్కడ జల్లులు పడుతున్నా బురదలోనే ఇంటింటికీ బాధితులతో మాట్లాడారు. వరద బాధితులకు పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం అందించారు.

ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. బాధితులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం కొత్తూరులో విద్యుదాఘాతతంతో మృతిచెందిన చాపర్ల వేణుమురళీ కుటుంబాన్ని మంత్రి పరామర్శించి కుటుంబసభ్యులను ఓదార్చి కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు జూపల్లి రమేశ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాలలో వైద్యుల ఖాళీల భర్తీకి చర్యలు

- స్పందించిన మంత్రి పొంగులేటి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భద్రాచలం జూలై 22: భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పనిచేస్తున్న వైద్యుల బదిలీతో ఏర్పడిన ఖాళీల భర్తీపై రెండురోజుల్లో చర్యలు చేపడతామని రాష్ట్ర రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ఏజెన్సీ వేద్యశాలలపై నిర్లక్షమేల.. వైద్యులు భారీ బదిలీతో అంతా ఆగమాగం అనే శీర్షిక న వెలువడిన కథనంకు ఆయన స్పందించారు. సోమవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన వరద సమీక్ష సమావేశంలో ఈ విషయమై ఏరియా వైద్యశాల సూపరండెంట్ డాక్టర్ ఎం.రామకృష్ణ తో మాట్లాడుతూ జిల్లా వరకు బదిలీ అయిన వైద్యుల ఖాళీల భర్తీకి రెండు రోజుల్లో చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన వారి విషయంలో సైతం సత్వరమే పరిష్కారమార్గాన్ని కనుగొంటామని పేర్కొన్నారు.


ఏజెన్సీ వైద్యశాలలపై నిర్లక్ష్యమేలా

'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

'సీతారామ' డిజైన్ మార్చాలని మంత్రికి వినతి

ఇల్లెందు టౌన్, జూలై 22: గోదావరి జలాలను ఇల్లెందుకు తీసుకొచ్చేవిధంగా సీతారామ ప్రాజెక్టును రీ డిజైన్ చేయాలని కోరుతూ సోమవారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఇల్లెందు నియోజకవర్గం సాగునీరు అవసరాలు తీర్చాలని, గత పాలకులు చేసిన డిజైన్‌ను మార్చి ఏజెన్సీ ప్రాంతానికి నీరు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటిని అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ నాయకులు ఏపూరి బ్రహ్మం, సీపీఎం పార్టీ నాయకులు ఎస్ఏ. నబీ, న్యూడెమోక్రసీ నాయకులు బి. రాంసింగ్, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, సీపీఐ పట్టణ కార్యదర్శి బందం నాగయ్య, మాస్‌లైన్ పట్టణ కార్యదర్శి యాకూబ్ షావళి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న గుమ్మడి

తెలంగాణా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన దాశరథి

- మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం కార్పొరేషన్, జూలై 22: తెలంగాణా ప్రజల గుండెల్లో దాశరథి కృష్ణమాచార్య చిరస్థాయిగా నిలిచారని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. దాశరథి జయంతి సందర్భంగా నామా ఓ ప్రకటన చేస్తూ ఆయన రగిల్చిన చైతన్య స్ఫూర్తి తెలంగాణ ఏర్పాటుకు సంకల్పబలం ఇచ్చిందన్నారు. తెలంగాణా సాయుధపోరాటంలో పాల్గొన్న దాశరథి తన కవిత్వం, రచనల ద్వారా ఉద్యమానికి బాసటగా నిలిచారన్నారు. నా తెలంగాణా,కోటి రతనాల వీణ అన్న కవితతో ఎందరిలోనే ఉద్యమపోరాట స్ఫూర్తిని కలిగించిన దాశరథి బాల్యం, విద్యాభ్యాసం తాను ప్రాతినిధ్యం వహించిన ఖమ్మం ఎంపీ నియోజకవర్గ పరిధిలో ఉండటం తనకెంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

గురుకులాల ఆర్సీవోగా నాగార్జున బాధ్యతల స్వీకరణ

భద్రాచలం, జూలై 22: ఖమ్మం రీజియన్ గురుకులాల సమన్వయ అధికారిగా నాగార్జున సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రాంతీయ సమన్వయ కర్తగా(ఆర్సీవో) బాధ్యతలు స్వీకరించిన అనంతరం గిరిజన సమగ్ర అభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఏపీవో జనరల్ డేవిడ్‌రాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

డెంగ్యూతో మహిళ మృతి

చర్ల, జూలై 22: చర్ల మండల కేంద్రంలోని విజయకాలనీ చెందిన డి, రమణ (43) అనే మహిళ సోమవారం డెంగ్యూతో మృతి చెందింది. గత కొద్ది రోజుల క్రితం ఆమె జ్వరం బారిన పడింది. ఇదే క్రమంలో చర్లలో వైద్యంతో పాటు రక్త పరీక్షలు చేయించుకుంది. పరీక్షల్లో డెంగ్యూ, ఎస్ఎస్ పాజిటివ్ వచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదే క్రమంలో వైద్యం పొందుతూ మృతి చెందింది. కాగా గత కొంత కాలంగా చర్ల మండలంలో డెంగ్యూ మరణాల సంఖ్య పెరుగుతోంది. జ్వరభాధితులు అధికంగా కనపిస్తున్నారు. మండల కేంద్రంలో పారిశద్ధ్యలోపం అధికంగా కనిపిస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారు.

కూలిన భారీ వృక్షం

అశ్వాపురం, జూలై 22: ఎడతెరిపి లేని వర్షం కారణంగా సోమవారం మండల పరిధిలోని చింతిర్యాల ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకూలింది. దీంతో చింతిర్యాల-అశ్వాపురం గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది.అనంతరం అధికారులు ప్రధాన రహదారికి అడ్డంగా ఉన్న వృక్షాన్ని ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు.



షార్ట్‌సర్క్యూట్‌తో గ్రీన్‌ఫీల్డ్‌హైవే జనరేటర్ దగ్ధం

వైరా, జూలై 22: గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డుకు చెందిన ఒక జనరేటర్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. వైరా-జగ్గయ్యపేట, మధిర వెళ్లే రోడ్డులో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు చెందిన అండర్ పాస్ హైలెవల్ వంతెన వద్ద పనులు జరుగుతున్న సమయంలో సోమవారం ఈ ప్రమాదం జరిగింది. హైలెవల్ వంతెన పనులు చేస్తున్న కార్మికులు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ వంతెన నిర్మాణ సమయంలో స్లాబ్ కుప్పకూలిన ఘటన మరవకముందే జనరేటర్‌లో షార్ట్‌సర్క్యూట్ సమస్య తలెత్తి దగ్ధం కావడం, కార్మికులు ప్రమాద బారీనుంచి బయటపడటం ఇక్కడ చర్చనీయాంశమైంది.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్ష

ఖమ్మం లీగల్, జూలై 22: ఖమ్మం నగరంలోని లెనిన్‌నగర్ కు చెందిన సయ్యద్ యూసఫ్ ఆలీకి చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు శిక్ష తోపాటు ఫిర్యాదికి రూ.పదిలక్షలు చెల్లించాలని ఖమ్మం మొదటి అదనపు ప్రథమశేణి కోర్టు న్యాయాధికారి బిక్కం రజని సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఖమ్మం నగరంలోని కవిరాజ్‌నగర్‌కు చెందిన ఫిర్యాది చెన్నూరి రాజ్యలక్ష్మి వద్ద నిందితుడు తన కుటుంబ అవసరాల నిమిత్తం 5-12-2016న పదిలక్షల రూపాయలను అప్పుగా తీసుకొని అదే రోజు ప్రాంసరీనోటు రాయించి ఇచ్చాడు. ఫిర్యాది తన రుణంను తిరిగి చెల్లించమని వత్తిడి చేయగా నిందితుడు 24-10-2017న చెక్కును జారీచేసినా డు. ఆ చెక్కును ఫిర్యాది తన బ్యాంక్‌ఖాతాలో జమచేయ గా నిందితుని సంతకం సరిపోకపోవటంతో చెక్కు తిరస్కరణకు గురిఅయినది. ఫిర్యాది తన న్యాయవాది అయిన మందడపు శ్రీనివాసరావు ద్వారా లీగల్ నోటీస్ జారీచేసి కోర్టులో నిందితునిపై ప్రైవేటు కేసు దాఖలుచేసినారు. ఆ కేసును విచారించిన న్యాయాధికారి నిందితునిపై నేరం రుజువుకావటంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

- తృటిలో తప్పిన ప్రాణా పాయం
- తీవ్ర గాయాలతో దంపతులు
- మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలింపు

మణుగూరు, జూలై 22 : మణుగూరు మండలంలోని ముత్యాలమ్మ నగర్ పంచాయతీ పరిధిలోని ముత్యాలమ్మనగర్ ప్రధాన రహదారిపై సోమవారం మధ్యాహ్నం నడుస్తున్న కారులో షార్టు సర్క్యూట్ కావడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. అదృష్టవ శాత్తు అందులో ప్రయాణిస్తున్న దంపతులు స్థానికులు సహకారంతో ప్రాణాలతో బయటపడ్డారు. తీవ్ర గాయాల పాలైన వీరిని స్థానిక ఏరియా ఆసుపత్రికి ఆ తర్వాత కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని శ్రీశ్రీ నగర్ ప్రాంతంలో నివాసముండే సింగరేణి ఓసీ -2 గని ఎస్అండ్‌డి సెక్షన్‌లో పని చేసే కార్మికుడు రామ్మోహన్ తన భార్య పాలకోటి జోష్నరాణితో కలసి ఏరియా ఆసుపత్రికి తన సొంత కారులో బయలుదేరారు. కొంతకాలంలో అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రామ్మోహన్‌రావు ఇటీవలే హైదరాబాద్ వెళ్లి చికిత్స తీసుకున్నాడు. కాగా ఇన్‌జెక్షన్ కోర్సును వేయించుకునేందుకు ఏరియా ఆసుపత్రికి పయనమయ్యారు. ఈ క్రమంలో సంతోష్ నగర్ దాటుతుండగా కారు నుంచి మంటలు వ్యాపించాయి. గ్యాస్ సిలిండర్‌కు తర్వరితగతిన వ్యాపించాయి. మంటలు ఎగసి పడుతుండగా ఓ ఆటో డ్రైవర్ ప్రమాదాన్ని గుర్తించి రక్షణ చర్యలను చేపట్టారు. అంతేకాకుండా స్థానికులు కూడా మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కారులో ఉన్న వారిని వెంటనే డోర్లు ఓపెన్ చేసి కారునుంచి బయటికి తీశారు. అప్పటికే రామ్మోహన్‌రావు అతని భార్యకు వీపు భాగం కాలిపోయింది. తీవ్రస్థాయిలో గాయాల పాలైన దంపతులను ఏరియా ఆసుపత్రికి తరలించారు. దంపతులు కారు దిగిన కొద్ది క్షణాల్లోనే గ్యాస్ సిలిండర్ కూడా పేలిపోయింది. దీంతో తృటిలో ప్రాణాపాయం తప్పినట్లైంది. కారులో మంటలు చెలరేగాయన్న విషయాన్ని తెలుసుకున్న వెంటనే పోలీసు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆపేందుకు ప్రయత్నించారు.ఈ అగ్ని ప్రమాదంలో కారు పూర్తిగా కాలిపోయింది. క్షత గాత్రులను మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామ్మోహన్‌ను కార్మిక సంఘ నాయకులు రాంగోపాల్, ప్రభాకర్ రావు, సుదీప్ తదితరులు పరామర్శించారు.



దగ్ధమవుతున్న కారు, గాయాలపాలైన రామ్మోహన్‌ను పరామర్శిస్తున్న నాయకులు

ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న కారు

- ఒకరు మృతి
- మద్యం మత్తులో కారు డ్రైవర్

ఖమ్మం క్రైం, జూలై 22: ద్విచక్రవాహనాన్ని అతివేగంగా వచ్చి కారు ఢీకొన్నఘటనలో వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం తెల్లవారు జామున ఖమ్మం నగరంలో జరిగింది. మృతుని కుటుంబసభ్యుల కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన జటంగి యాకయ్య (35) నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతని భార్య గౌతమితో కలిసి శ్రీరామ్‌నగర్‌లోనివాసం ఉంటున్నాడు. సోమవారం తెల్లవారుజామున భార్య హైదరాబాదు వెళ్లేందుకు బస్సు ఎక్కించేందుకు ఇంటినుంచి బయలుదేరారు. ఈక్రమంలో ముస్తఫానగర్ సమీపంలోకి రాగానే ఎదురుగా ఓ కారు అతివేగంగ వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రగా గాయపడ్డారు. గమనించిన స్థానిక వ్యక్తి 108కు ఫోన్‌చేయడంతో వారు వచ్చి అపస్మారకస్థితిలో ఉన్న యాకయ్యను సీపీఆర్‌చేసి బతికించేందుకు ప్రయత్నించారు కాగా అతడు అప్పటికే మృతిచెందాడు. అదేవిధంగా భార్య గౌతిమకూడా తీవ్రంగా గాయపడడంతో అంబులెన్సులో నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. యాకయ్య మృతదేహంతో ప్రభుత్వాసుపత్రి మార్చురికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా కారునడుపుతున్న యువకుడు మద్యం మత్తులో ఉండడమే ప్రమాదానికి కారణమని తెలిసింది. ద్విచక్రవాహనం ఢీకొట్టిన అనంతరం అదే కారు సమీపంలోని విద్యుత్ స్థంబాన్ని కూడా ఢీకొట్టి ఆగింది.


యాకయ్య (ఫైల్)

మంచి ఫలితాలు వచ్చేలా బోధనలు సాగాలి

అశ్వారావుపేట రూరల్, జూలై 22: మంచి ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తూ బోధనలు చేయాలని ఎంఈవో కె.లక్ష్మీ సూచించారు. మండలంలోని రామన్నగూడెం, ఆసుపాక, వినాయకపురం కాలనీ, వినాయకపురం, కొత్తూరు, అశ్వారావుపేటతో పాటు పలు పాఠశాలలను సోమవారం ఎంఈవో కె.లక్ష్మీ సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల, ఉపాధ్యాయుల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా సిలబస్‌ను సకాలంలో పూర్తిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో జరుగుతున్న పనులను త్వరగా పూర్తిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రామారావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.ఈకింది ఐటంకు ఫోటో కలదు



ఉధృతంగా ప్రవహిస్తున్న ఏడుమెలికలవాగును దాటుతున్న రైతులు

ఎడతెరిపిలేని వాన

- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- పోలీసు, రెవెన్యూ అధికారుల అప్రమత్తం

కొత్తగూడెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సోమవారం కూడ పలు మండలాల్లో వర్షం కురిసింది. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో కురిసిన వర్షానికి సైతం పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు వరద నీరు ఉధృతంగా రావడంతో 403 అడుగులకు నీటి మట్టం చేరింది. 3గేట్లు ఎత్తి 16వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కింద ఉన్న ముంపు గ్రామాల్లో రెవెన్యూ, పోలీసులు పర్యటిస్తూ వాగులు వంకలు దాటి వెళ్లవద్దని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నది వరద నీటిమట్టం పెరుగుతోంది. చత్తీస్‌గడ్, ఒరిస్సా, తాలిపేరు ప్రాజెక్టు గేట్లు ఎత్తడం కురిసిన వర్షాల మూలంగా భద్రాచలం వద్ద నీటిమట్టం పెరుగుతోంది. సోమవారం 48. 80అడుగులకు నీటి మట్టం చేరింది. ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయి. తుది ప్రమాద హెచ్చరికలను జారీ చేసే అవకాలు ఉన్నాయి.

అదేవిధంగా భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద ఉధృతి పెరుగుతుంది. సాయంత్రానికి 48.80 అడుగులకు నీటి మట్టం రాగా రెండో ప్రమాద హెచ్చరికను ప్రకటించిన అధికారులు. తుది ప్రమామాదపు హెచ్చరిక జారి చేసే అవకాశాలున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. గోదావరి వరద ఉధృతిని రెవిన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. అనంతరం భద్రాచలంలో గోదావరి వరదపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండ తగినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాలిపేరు ప్రాజెక్టుక 25గేట్లు ఎత్తి 60వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కిన్నెరసాని ప్రాజెక్టుకు వరద ఉధృతి.. 403 అడుగులకు చేరిన నీటి మట్టంతో 3గేట్లు ఎత్తి 16వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. పలువాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి.. చెరువులు నిండుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా సరాసరి వర్షపాతం 4 సెంటీమీటర్లు, కరకగూడెం 8.6 సెంటీమీటర్లు, పినపాక 9.2, చర్ల 9.2, దుమ్ముగూడెం 5.4, అశ్వాపురం 4.8, మణుగూరు 6.2, ఆళ్లపల్లి 4.2, గుండాల 4, భద్రాచలం ఇల్లెందు, టేకులపల్లి, జూలూరుపాడు మూడు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా ఎడతెరపి లేని వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండుతన్నాయి, సుజాతనగర్‌లోని సింగభూపాలం చెరువు అశ్వాపురంలోని తుమ్మల చెరువులు నిండి అలుగులు పడ్డాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు సింగరేణి ప్రాంతాల్లోని ఓపెన్‌కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం జరుగుతుంది.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

కొత్తగూడెం ఏరియా, ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లో సుమారు 1.60 లక్షటన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఓపెన్‌కాస్టు గనుల్లోకి వర్షపు నీరు చేరడం వల్ల యంత్రాల రాకపోకలకు ఇబ్బందులు పడ్డాయి. ఓబీ మట్టి పనులు కూడా తీయలేకపోయారు. వర్షపు నీటిని పైపలైన్ల ద్వార నీటిని బయటకు పంపింగ్ చేయిస్తున్నారు.

స్థంభించిన రాకపోకలు

గుండాల: గుండాల మండలంలో ఎడతెగని వర్షం కురుస్తుంది. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కిన్నెరసాని, మల్లన్న వాగు, ఏడుమేలికలవాగు, తొట్టివాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దొంగతోగు, సజ్జలబోడు, నాగారం, కొడవటంచ, మల్లెలగుంపు, మంటంలంక, దామరతోగు దొరగుంపు గ్రామాలకు రాకపోకలు స్థంబించి పోయాయి. కిన్నెరసాని ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కొడవటంచ వద్ద వంతెన నీటిలో మునిగిపోయింది.

అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు

కరకగూడెం: ప్రజలు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవర పరిస్థితుల్లో తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని ఏడూళ్ళ బయ్యారం సీఐ వెంకటేశ్వరావు తెలిపారు. సోమవారం మండలంలోని కన్నాయిగూడెం పంచాయతీ బంగారుగూడెం వద్ద ప్రధాన రహదారి దుప్పితోగు వాగు బ్రిడ్జి వద్ద వరద ప్రవహానికి ప్రమాదకరంగా ఉండటంతో సీఐ పరిశీలించారు. అక్కడ పంచాయితీ కార్యదర్శి తరుణ్ రాకపోకలు నిలిపి ట్రాక్టర్‌ను అడ్డుగా పెట్టారు. సీఐ వెంకటేశ్వరావు అధికారులతో మాట్లాడి రహదారి మరమ్మతులు చేపించి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో కరకగూడెం ఎస్ఐ రాజేందర్, బయ్యారం ఎస్ఐ రాజ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.



దుప్పితోగు వాగు బ్రిడ్జిని పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వ

ప్రజలకు ముందుస్తు సూచనలు

మణుగూరుటౌన్: గోదావరి నదీ ఉధృతి గంటగంటకు పెరుగుతూ రెండవ ప్రమాద హెచ్చరికను దాటిన నేపద్యంలో ముందస్తుగా మణుగూరు పోలీస్, మండల పరిషత్, మండల రెవెన్యూ అధికారులు నదీ పరివాహక ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. గోదావరి నది ప్రవాహాన్ని పరిశీలించారు. తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు, సీఐ సతీష్‌కుమార్‌లు ఆయా గ్రామాల ప్రజలకు ముందుస్తు సూచనలు, జాగ్రత్తలు సూచించారు.ఆయా గ్రామాల్లో ప్రజలెవరు చేపల వేటకు వెళ్లద్దని సూచించారు. పర్యటనలో డీటీ కృష్ణ, ఆర్ఐ లీలావతి, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధిపై విచారణకు సిద్ధమా..?

- అవినీతి ఆరోపణలపై పాలకవర్గమే విచారణ జరిపించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ బాలశౌరి

కొత్తగూడెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించేందుకు పాలకపక్షం ముందుకురావాలని అఖిల పక్షం నాయకులు సవాల్ విసిరారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు ప్రశ్నకు ప్రశ్న సమాధానం కాదని నాలుగున్నర ఏళ్ల అవినీతిపై సమగ్ర విచారణకు స్థానిక ఎమ్మెల్యే పూనుకోవాలని కోరారు. మున్సిపాలిటీలో పలు రకాల టెండర్లలో అవినీతి జరిగిందని ఆరోపణలు వస్తుంటే స్థానిక ఎమ్మెల్యే ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. పట్టణంలోని 5వ వార్డులో సింగరేణి సంస్థ స్థలాన్ని తప్పుడు ధృవపత్రాలతో ఇంటి నెంబరు ఎవరు కేటాయించుకున్నారో ప్రజలందరికి తెలుసని, దొంగ.. దొంగ అన్న చందాన మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పాత కొత్తగూడెంలో పేదలకు ఇచ్చిన ఖాళీ స్థలాల పక్కన రూ. 2కోట్ల విలువైన స్థలం కబ్జాకు గురైన స్పందించ లేదని, రామవరం ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు అమ్ముకుంటున్నది ఎవరో విచారణ జరిపితే లోగట్టు బయటకు వస్తుందని విమర్శించారు. నాలుగున్నర ఏళ్లుగా రామవరం ప్రజలకు ప్రొజిషన్ సర్టిఫికెట్లు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని స్థానికంగా ఉన్న మున్సిపల్ చైర్‌పర్సన్ వైఫల్యం కాదా అని పేర్కొన్నారు. వెంటనే మున్సిపల్ అవకతవకలపై ఆర్డీవో స్థాయి అధికారితో విచారణ జరిపించాలని తద్వారా పాలకపక్షం తమ చిత్తశుద్దిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. లేకుంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ విలేకర్ల సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్, సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటి కన్వీనర్ జలాల్, ప్రముఖ న్యాయవాది సాదీక్‌పాషా, టీఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ కౌన్సిలర్లు, దళిత సంఘాల నాయకులు, బీసీ సంఘం, కాంగ్రెస్ యువజన నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

సహాయక చర్యల్లో పార్టీ శ్రేణులు భాగస్వామ్యం కావాలి: సీపీఐ

కొత్తగూడెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలతో గోదావరి పరివాహక ప్రాంతాలతోపాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు సహాయ, సహకారాలు అందించి అండగా నిలవాలని పార్టీ శ్రేణులకు, రెడ్ షర్ట్ వాలంటీర్లకు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. సోమారం సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో ఆయన మాట్లాడుతూ గోదావరి నది మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ఉధృతంగా ప్రవహిస్తోందని, ఇప్పటికే చాలా ఏజెన్సీ గ్రామాలు వరదల్లో చిక్కుకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ పరిస్థితిలో బాధితులకు అండగా నిలవాలని ప్రభుత్వ అధికారులను సంప్రదించి వారితోపాటు సహాయ చర్యల్లో పాల్గొనాలని కోరారు. అధికార యంత్రాంగం స్పందిస్తున్న తీరును స్వాగిస్తున్నామని, వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు సేవలను కొనసాగించాలని కోరారు. మండల, పట్టణ, గ్రామస్థాయి పార్టీ కార్యాలయాలను పునరావాస కేంద్రాలు నిర్వహించేందుకు సిద్దం చేసి అధికారులకు సమాచారం అందించాలని పార్టీ నాయకత్వానికి సూచించారు.వైద్యశాఖకు సమాచారం అందించి ప్రతి గ్రామంలో వైద్యశిభిరాలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేయడంతోపాటు పారిశుధ్యం మెరుగుపర్చేందుకు గ్రామపంచాయతీ, మున్సిపల్‌శాఖలను అప్రమత్తం చేయాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే కోరం

టేకులపల్లి, జూలై 22: ప్రజా, రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని ముత్యాంపాడుక్రాస్‌రోడ్డు రైతు వేదికలో సోమవారం కల్యాణలక్ష్మీ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కృతనిశ్చయంతో ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రూ.2లక్షలు రైతుల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రుణమాఫీ విషయంలో రైతులు ఇలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మొదటి విడత పూర్తికాగానే రెండవ విడత లక్షన్నర రుణమాఫీ, అనంతరం ఆగస్టు 15వరకు రూ.2లక్షలు రుణమాఫీ జరుగుతుందని స్పష్టం చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి 71 కల్యాణలక్ష్మీ చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగభవానీ, ఎంపీపీ అధ్యక్షురాలు బానోతు మౌనికా, వైస్‌ఎంపీపీ ఉండేటి ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు లక్కినేని సురేందర్‌రావు, ఎంపీటీసీ సభ్యులు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిలు చెల్లిచండి: సీఐటీయూ

భద్రాచలం, జూలై 22: గిరిజన సంక్షేమ శాఖలో అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు 17 నెలలుగా చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుటన్నారని పేర్కొంటూ వారికి సత్వరమే వేతన బకాయిల చెల్లించాలని డిమాండ్ చేస్తూ భద్రచలం ఐటీడీఏ ఎదుట సోమవారం నిరసన నిర్వహించారు. సీఐటీయు ఆధ్వర్యంలో అవుట్‌సోర్సింగ్ కార్మికులు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించగా అనంతరం డీడీ మణెమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా అధ్యక్షులు బ్రహ్మాచారి, నాయకులు చందా జలందర్ రామ, తిరుపతమ్మ, జయ స్వరూప రాజేష్, రాజ్యలక్ష్మి, మెన్న, పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలి: సీపీఎం

అశ్వారావుపేట, జూలై 22: షరతులు లేకుండా రైతులందరికి రుణమాఫీ చేయాలని సీపీఐఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన గడ్డం సత్యనారాయణ అధ్యక్షతన సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె పుల్లయ్య, పిట్టల అర్జున్, బి చిరంజీవి, ముళ్ళగిరి గంగరాజు, మడకం గోవింద, సోడెం ప్రసాద్, మడిపల్లి వెంకటేశ్వరరావు, తగరం నిర్మల, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అరకొరగా రుణమాఫీ: బీఆర్ఎస్

దుమ్ముగూడెం జూలై 22: కాంగ్రెస్ ప్రభుత్వం అరకొరగా రుణమాఫీ చేసి రైతులను మోసగించిందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అన్నె సత్యనారాయణ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15వేలు రైతుభరోసా ఇస్తామని హామీ ఇచ్చి డ్రస్ లేదని విమర్శించారు. వందశాతం రుణమాఫీ చేయని పక్షంలో పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. ప్రధాన కార్యదర్శి రాముడు, జానీపాషా పాల్గొన్నారు.

కేటీపీఎస్ కార్మికులకు టీజేఎస్ అండగా నిలుస్తుంది

పాల్వంచ టౌన్, జూలై 22 : కేటీపీఎస్ 6వ దశ నిర్మాణ కార్మికులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ జనసమితి (టీజేఎస్) పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు అన్నారు. సోమవారం కేటీపీఎస్ 6వ దశ నిర్మాణ కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ బాధ్యతలతో కలిసి ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 6వ దశ నిర్మాణ కార్మికులుగా పని చేసిన వారిలో 250మంది కార్మికులకు యాజమాన్యం ఉపాధి కల్పించకుండ విస్మరించిందన్నారు. కార్మికుల సమస్యలను ప్రొఫెసర్ కోదండరాం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి మరోమారు తీసుకెళ్లి కార్మికులకు న్యాయం జరిగే వరకు టీజేఎస్ వారితో కలిసి పని చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షులు బరగడి దేవదానం, 6వ దశ నిర్మాణ కార్మిక జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి జయంతి

దుమ్ముగూడెం జూలై 22:లక్ష్మీనగరంలో దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు సంస్కృతి, సాహితీ రంగానికి దాశరథి ఎనలేని కృషి చేశారని కళాకారుడు పిలకా నాగేంద్రరెడ్డి కొనియాడారు. శ్రీను, వెంకటరెడ్డి, నాగేశ్వరెడ్డిలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలని ఆందోళన

జూలూరుపాడు, జూలై 22: ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని కోరులూ సోమవారం జూలూరుపాడులో ఉపాధి హామీ కార్యలయం ఎదుట కూలీలు ధర్నా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి కూలీలు 100 రోజుల పాటు పనులను చేసినప్పటికి వారికి రెండు నెలలకు సంబంధించిన వేతనాలను చెల్లించకపోవటం తగదన్నారు.

భద్రతా నియమాలు పాటించాలి: ఎస్ఐ

గుండాల, జూలై 22; వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని గుండాల ఎస్ఐ రాజమౌళి అన్నారు. సోమవారం గుండాల ప్రధాన రహదారులపై పోలీసు సిబ్బందితో కలసి ముమ్మరంగా వహనాలను తనిఖీ చేశారు.

సారపాకలో ఆలయాల్లో చోరీ

బూర్గంపాడు, జూలై 22: బూర్గంపాడు మండల పరిదిలోని సారపాక పంచాయతీలో గల రెండు ఆలయాల్లో ఆదివారం రాత్రి చోరీ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం...తాళ్లగొమ్మూరులోని సత్యనారయణస్వామి ఆలయంతో పాటు గోదారమ్మ క్యాంపులోని ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ జరిగినట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఆలయానికి చేరుకున్న అర్చకులు ప్రధాన ద్వారం తాళం పగలుగొట్టి తలుపులు తెరిచి ఉండడం గమనించారు. హుండీలలోని నగదును అపహరించినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు.

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం: మంత్రి పొంగులేటి

బూర్గంపాడు, జూలై 22: గోదావరి వరద ఉధృతితో ప్రజలు అధైర్య పడొద్దని రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం బూర్గంపాడు మండల పరిదిలోని గొమ్మూరు వద్ద గోదావరి వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

'కిన్నెరసాని'ని సందర్శించిన కొత్వాల

పాల్వంచ రూరల్, జూలై 22 : కిన్నెరసాని జలాశయానికి వరదనీరు తగ్గకపోవడంతో నీటిమట్టం పెరుగుతోంది. సోమవారం 403 అడుగులకు నీటి మట్టం చేరింది. ఎగువ ప్రాంతం నుంచి నీరు భారీగా చేరుతోంది. ఇన్‌ఫ్లో 12వేల క్యూసెక్కుల చొప్పున ప్రాజెక్టుకు వస్తుండటంతో 3గేట్లు ఎత్తి 12వేల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నారు. పర్యావక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు మైకు ప్రచారం చేస్తున్నారు.

కిన్నెరసాని ప్రవాహాన్ని పరిశీలించిన కొత్వాల

కిన్నెరసాని జలాశయం ప్రవాహాన్ని మార్క్‌ఫెడ్‌కమిటీ సభ్యులు, డీసీఎంఎస్‌చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. కిన్నెరసానికి వరద ఉధృతి పెరుగుతుండటం వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండ అప్రమత్తం చేయాలన్నారు. కిన్నెరసాని, రాజాపురం బ్రిడ్జి పనులను పరిశీలించారు. లోతట్టు గ్రామాల్లో తిరిగి ప్రజలతో మాట్లాడారు. నీటి ప్రవాహం గ్రామాల్లో చేరితే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొండం వెంకన్న, నాయకులు వై. వెంకటేశ్వర్లు, బుడగం నాగేశ్వరరావు, కాపర్తి వెంకటాచారి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వరద ఉధృతిని పరిశీలిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్

ఆగస్టు నాటికి నియోజకవర్గానికి గోదావరి జలాలు అందిస్తాం

- వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

జూలూరుపాడు, జూలై 22: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు, ఏన్కూరు, కారేపల్లి, కొణిజర్ల మండలాలకు గోదావరి జలాలను ఆగస్టు నాటికి తీసుకువచ్చి రైతులకు సాగు నీటిని అందిస్తామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం జూలూరుపాడులో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సీతారామ ప్రాజెక్ట్‌కు కేటాయించిన నిధులతో పనులు చేపట్టకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సాగునీటి కోసం వైరా నియోజకవర్గం పరిధిలోని రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకచౌదరి ద్వారా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లటం జరిగిందన్నారు. సమావేశంలో ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్, నాయకులు రోకటి సురేష్, నవీన్ రాథోడ్, నర్వనేని పుల్లారావు, వై. చిన్న నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలి: డీఎస్పీ

అశ్వాపురం జూలై 22: గోదావరి వరద రెండవ ప్రమాద హెచ్చరికను దాటిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలో మొదటగా ముంపుకు గురయ్యే పాములపల్లి,కుమ్మరిగూడెం, బట్టీలగుంపు, నెల్లిపాక గ్రామాలను అధికారుల బృందం సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. డీఎస్పీ మాట్లాడుతూ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,అధికారుల సూచనలు పాటించాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురయినా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, సీఐ అశోక్‌రెడ్డి, మణుగూరు ఏడీఏ తాతారావు, అశ్వాపురం ఏవో సాయిశంతన్‌కుమార్, ఎస్ఐలు సురేష్‌కుమార్, తిరుపతిరావు, ఆర్ఐలు నాగమణి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు విడుదల చేయాలి

దమ్మపేట, జూలై 22: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను, కోడిగుడ్ల బిల్లులను తక్షణమే చెల్లించాలని, ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేతనం పదివేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. మండలంలోని గండుగులపల్లిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బందికి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మధ్యాహ్న భోజన కార్మికులు అందించారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరమ్మ, జ్యోతి, సత్యావతి, శ్రీలత, సుజాత, దేవీ, కృష్ణవేణితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఏడూళ్లబయ్యారం సీఐ బాధ్యతల స్వీకరణ



పినపాక, జూలై 22: మణుగూరు సబ్ డివిజనల్ పరిధిలోని ఏడూళ్లబయ్యారం సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా వేల్పుల వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెం ఇంటిలిజెన్స్ విభాగంలో విధులు నిర్వహించిన సీఐ వెంకటేశ్వరరావు ఏడూళ్లబయ్యారం సర్కిల్‌కు సీఐగా బదిలీ అయ్యారు. ఏడూళ్లబయ్యారం, కరకగూడెం ఎస్ఐలు ఇ రాజ్‌కుమార్, రాజేందర్‌లు సీఐ వెంకటేశ్వరావుకు స్వాగతం పలికి, మొక్కలను బహుకరించారు.

రాయల చంద్రశేఖర్ ఆశయాలను కొనసాగించాలి

జూలూరుపాడు/ఇల్లెందుటౌన్/సుజాతనగర్, జూలై 22: విప్లవోద్యమ నాయకుడు రాయల చంద్రశేఖర్ ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేశారని, ఆయన నమ్మిన సిద్ధాంతం, సోషలిజం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలందరు పనిచేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సభ్యులు జాటోత్ కృష్ణ పిలుపునిచ్చారు. ఇటీవల అకాల మృతి చెందిన సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు చైర్మన్ రాయల చంద్రశేఖర్ సంతాప కార్యక్రమాలను సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆయన ఆశయాలను కొనసాగించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఏదులాపురం గోపాలరావు, బాణోత్ ధర్మా, నాయకులు రాంచందర్, జవహర్‌లాల్, కృష్ణయ్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు టౌన్: పేదల కోసం పని చేసిన రాయల చంద్రశేఖర్ ఆశయాల సాధన కోసం కృషి చేయాలని మాస్‌లైన్ పట్టణ కార్యదర్శి ఎస్‌కే. యాకూబ్‌షావలి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ వాటర్‌సప్లై కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సభలో మాస్‌లైన్ నాయకులు దుర్గామహేష్, సదా, సంజు, ప్రకాష్, రాజు పాల్గొన్నారు.

సుజాతనగర్: కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ జీవితం విప్లవకారులకు ఆదర్శనీయం అని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ అన్నారు. సోమవారం పాత అంజనాపురం గ్రామంలో కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఎదులాపురం గోపాలరావు, బానోత్ ధర్మ, డివిజన్ నాయకులు గుగులోత్ రామచందర్, మండల నాయకులు పోలబోయిన కేశవరావు, గడ్డం పాపక్క, కోరం నాగమ్మ, ఎట్టి లక్ష్మి, కోరం మాణిక్యమ్మ, గడ్డం రామచంద్ర తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం హెల్మెట్‌ల పంపిణీ

అశ్వాపురం జూలై 22: రోడ్డు ప్రమాదంలో చనిపోయిన తమ స్నేహితుడి జ్ఞాపకార్థం తోటి స్నేహితులకు హెల్మెట్‌లు పంపిణీ చేశారు. మండల పరిధిలోని మిట్టగూడెం పాఠశాలలో 2004 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు గత నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మిట్టగూడెం గ్రామానికి చెందిన ఆలం రాజు జ్ఞాపకార్థం తోటి స్నేహితులకు తమ గురువు చేతుల మీదుగా హెల్మెట్‌లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయురాలు కంజర్ల వాణి మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవటం మూలంగానే మిత్రుడిని కోల్పోయామని, ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రయాణంలో హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు అనిల్, మహేష్, రాజు, జానకిరావు, విజయ్, శ్రీను, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కూలిన పాఠశాల స్టాఫ్‌రూం పై కప్పు..

మణుగూరుటౌన్, జూలై 22: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలోని స్టాఫ్ రూం పైకప్పు కూలిపోయింది. స్టాఫ్‌రూంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. వారం రోజులుగా వర్షాలకు తడిచి నానిపోవడంతో కూలిపోయిఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. పట్టణంలోని కుమ్మరిబజార్ ప్రాంతంలో మారపాకుల వెంకటేశ్వర్లు ఇంటిగోడ కూలిపోయింది. బాధితులను ప్రభుత్వమే ఆదుకోవాలని పలువురు నాయకులు కోరుతున్నారు.

పహణీలపై రుణాలు పొందిన రైతులకు మాఫీని వర్తింప చేయాలి

జూలూరుపాడు, జూలై 22: పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నవారికే కాకుండా గతంలో మండలంలో మాన్యువల్ పహణీల ద్వారా రుణాలు పొందిన రైతులకు రుణమాఫీని వర్తింప చేయాలని సొసైటీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు సంఘం అధ్యక్షుడు చీమలపాటి బిక్షం తెలిపారు. సోమవారం జూలూరుపాడులోని సొసైటీ కార్యాలయంలో పాలకవర్గం సమావేశాన్ని నిర్వహించి రుణమాఫీ పొందిన రైతుల జాబితాను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పహణీలు రుణాలు పొందిన రైతులకు కొత్తగా రుణాలను మంజూరు చేయకపోయినప్పటికి గతంలో ఇచ్చిన రుణాలను మాఫీచేయాలని కోరుతూ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతం కావటంతో చాలా మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరుకాలేదని, ప్రభుత్వం రుణమాఫీని పాస్ పుస్తకం ఉన్న రైతులకు వర్తింపు చేస్తామని నిబంధన విధించటంతో రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సీఈఓ రమణారెడ్డి, డైరెక్టర్లు యల్లంకి సత్యనారయణ, శిరంశెట్టి రామారావు, చాపలమడుగు రాంమూర్తి, పాపాని వెంకయ్య, తిరువెంగళరాజు, హేమ్లా, రజని, జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు అస్వస్థత

- అధికారి వేధిస్తున్నారని కుటుంబసభ్యుల ఆరోపణ

అశ్వారావుపేట రూరల్, జూలై 22: మండలంలోని ఊట్లపల్లి అంగన్‌వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు బి.కేదారేశ్వరి అస్వస్థతకు గురయ్యారు. కేదరేశ్వరికి సోమవారం రాత్రి బీపీ, షుగర్ లెవల్స్ పెరగటంతో కుటుంబసభ్యులు అశ్వారావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఘటనకు ఓ ఉన్నతాధికారిణి వేధింపులకు గురిచేస్తున్నారని, దాని వలనే అంగన్‌వాడీ టీచర్ అనారోగ్యం పాలయ్యారని ఆమె కుటుంబీకులు ఆరోపించారు. దీనిపై సదరు అధికారులను వివరణ కోరగా అంగన్‌వాడీ టీచర్, ఆయాల మధ్య గొడవ జరుగుతుందని, టీచర్‌పై ఆయా ఫిర్యాదు చేశారన్నారు. వేధింపులకు గురిచేసిన మాట అవాస్తమన్నారు. టీచర్‌ను వేధింపులకు గురిచేయలేదన్నారు.

వలస ఆదివాసీలకు వదలని రహదారి కష్టాలు

బూర్గంపాడు, జూలై 22: బూర్గంపాడు మండల పరిదిలోని సారపాక పంచాయతీలో గల శ్రీరాంపురం ఎస్టీ కాలనీ వాసులను రహదారి కష్టాలు వదలడం లేదు. జ్వరంతో బాధపడుతున్న వృద్ధురాలిని కావిడిపై ఆసుపత్రికి చేర్చిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. వలస ఆదివాసీ గ్రామమైన శ్రీరాంపురం ఎస్టీ కాలనీకి చెందిన నర్సమ్మ రెండు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతుంది. గ్రామానికి రహదారి లేకపోవడంతో గ్రామస్థులు కావిడిపై మోసుకుంటూ ప్రధాన రహదారికి తీసుకవచ్చారు. విషయం తెలుసుకున్న బూర్గంపాడు ఎస్ఐ రాజేష్ 108ద్వారా బాధితురాలిని భద్రాచలం తరలించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.



కావిడిపై మోసుకు వస్తున్న గ్రామస్థులు

సింగరేణి కార్మికవర్గానికి దిక్సూచి ఏఐటీయూసీ

- సంఘ అదనపు ప్రధాన కార్యదర్శి రంగయ్య

కొత్తగూడెం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికవర్గానికి దిక్సూచి ఏఐటీయూసీ అని, కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, సింగరేణిలో రాజకీయ జోక్యం వద్దని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య అన్నారు. సోమవారం శేషగిరిభవన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి బొగ్గుబ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. బొగుగ్గనులవేలాన్ని వ్యతిరేకిస్తూ నాటి నైజాం సర్కార్‌లో తీసుకు వచ్చిన చట్టాన్ని అమలుచేస్తూ గోదావరి పరివాహక ప్రాంతంలోని బొగ్గుగను సింగరేణి సంస్థకే అప్పగించాలన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఆరు నెలలు కావస్తున్న సింగరేణి యాజమాన్యం ఇప్పటి వరకు గుర్తింపు నియామకపత్రం ఇవ్వకపోవడం హస్యాస్పదంగా ఉందన్నారు. కంపెనీలో దందాలు చేస్తూ అనేక రకాల కార్యకలాపాలుచేస్తున్న వారిపై ఎటువంటి విజిలెన్స్ చర్యలుచేపట్టడం లేదన్నారు. సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యంతో కార్మికులకు కార్మిక సంఘాలకు అనేక రకాల అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో గుర్తింపు కార్మికసంఘం ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి గనిగల వీరస్వామి, కొత్తగూడెం ఏరియా బ్రాంచి కార్యదర్శి రమణమూర్తి, నాయకులు జక్కుల గట్టయ్య, కే. రాములు, కిష్టఫర్, శ్రీను, సుధాకర్ రాము, శ్రీనివాస్, స్వామి, శివదర్శన్, మల్లయ్య అనీల్, సురేందర్, లక్ష్మణ్, వసంత మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిర్యాల రంగయ్య